31072024-DIS-04_Layout 1 7/31/2024 3:40 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ప్రమాదంలో రైల్వే భద్రత

జార్ఖండ్‌లోని బడాబంబూ వద్ద జరిగిన హౌరా-ముంబై రైలు ప్రమాదం రైల్వేశాఖ అసమర్థ నిర్వహణను మరోసారి వేలెత్తి చూపిస్తున్నది. ఆ ప్రమాదంలో ఇద్దరు మరణించగా, 20 మంది దాకా గాయపడ్డారని వార్తలు వెలువడ్డాయి. ఒక ట్రాక్ మీద వెళ్తున్న గూడ్స్ బండి పట్టాలు తప్పి వ్యాగన్లు పక్కనున్న ట్రాక్ మీదకు ఒరిగాయి. వాటిని ఢీకొని ప్రయాణికుల రైలు ప్రమాదానికి గురైంది. ప్రపంచంలోనే అత్యధిక సిబ్బంది పనిచేసే సంస్థగా మన రైల్వేశాఖకు పేరున్నది. కానీ, ప్రమాదాల నివారణలో మాత్రం అప్రతిష్ఠ మూటగట్టుకుంటున్నది. సాంకేతికత ఎంతో అభివృద్ధి చెంది కృత్రిమ మేధస్సు అందుబాటులోకి వస్తున్న ఈ రోజుల్లో రొటీన్‌గా ఇలాంటి ప్రమాదాలు జరుగడం అర్థరహితం. అమాయక ప్రయాణికులు బలికావడం విషాదకరం.

ఏదో చెదురుముదురుగా జరుగుతున్న ప్రమాదాల్లో ఇదొకటని సరిపెట్టుకోవడానికి వీల్లేదు. జూలైలో జరిగిన వరుస ప్రమాదాలే అందుకు నిదర్శనంగా నిలుస్తాయి. జూలై 14న పశ్చిమబెంగాల్‌లోని ఖార్దాలో ఓ ప్రయాణికుల రైలు మరో రైలుకు చెందిన రెండు బోగీలను ఢీకొట్టింది. జూలై 20-21 తేదీల్లో యూపీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మూడుచోట్ల గూడ్సు రైళ్లు పట్టాలు తప్పాయి. అంతకుముందు జూన్ 17న పశ్చిమబెంగాల్‌లోనే కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ రైలును ఓ గూడ్సు రైలు వెనుక నుంచి ఢీకొన్నప్పుడు పదిమంది ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిశాయి. నిరుడు జూన్‌లో ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 293 మంది ప్రయాణికులు, సిబ్బంది మరణించినప్పుడు కవచ్ కార్యక్రమం గురించిన చర్చ జరిగింది. రైళ్లు ఢీకొనకుండా నివారించే 'కవచ్' వ్యవస్థ విస్తరణ నత్తనడకన నడుస్తున్నది. ప్రాధాన్య ప్రాతిపదికన దీన్ని విస్తరించడం లేదు. ఆ తర్వాత ప్రమాదాలు యథావిధిగా జరుగుతూనే ఉన్నాయి.

రైలు ప్రమాదం జరిగితే లాల్ బహదూర్ శాస్త్రి తరహాలో రైల్వేమంత్రులు రాజీనామాలు చేసే రోజులు పోయాయి. ఇప్పుడు నెపం ఎవరో ఒకరి మీదకు తోసి తమ పదవులు పదిలం చేసుకోవడమే ఆనవాయితీ. దర్యాప్తు జరిపించి కిందిస్థాయి సిబ్బందిని బలిపశువులను చేస్తుండటం మనం చూస్తూనే ఉన్నాం. రైల్వే యూనియన్లు నిరసిస్తున్నది ఈ ధోరణినే. మొన్నటి బడ్జెట్‌లో రైల్వేలకు అత్యధికంగా రూ.2.62 లక్షల కోట్లు కేటాయించారు. ఇలా పెద్ద మొత్తాలు కేటాయించడం వల్ల ప్రయోజనం ఉంటుందనుకుంటే పొరపాటే. రైల్వే శాఖ హైస్పీడ్ రైళ్లపై ఎక్కువ దృష్టిపెడుతూ భద్రతను, సిగ్నలింగ్‌ను పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. వరుస ప్రమాదాలు దీన్ని పట్టి చూపిస్తున్నాయి. అందువల్ల వేగానికి బ్రేకులు వేసి భద్రతకు పెద్దపీట వేయడం గురించి రైల్వేశాఖ పెద్దలు, కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలి. కవచ్ వంటి ప్రమాద నివారణ వ్యవస్థలను సత్వరమే రూపొందించి ఆచరణలోకి తేవాలి. అట్టడుగు నుంచి అత్యున్నత స్థాయి వరకు జవాబుదారీతనం ఉండేలా చూడాలి. సంతాపాలు, పరిహారాలు మరణించిన వారి కుటుంబాల ఆర్తిని తీర్చలేవు. రేపు మరో ప్రమాదం జరగదన్న భరోసానే రైలు ప్రయాణికుడికి అసలు ధీమా!

• కమలకు వెయ్యి శాతం మద్దతు

నల్లజాతి, భారతీయ మూలాలున్న కమలా హ్యారిస్ అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడటం హర్షణీయం. నా మద్దతు వెయ్యి శాతం ఆమెకే. ప్రత్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక్కటైనా ఉత్తమ లక్షణం లేని డొల్లమనిషి. ఆయన గెలవకూడదు.

- సల్మాన్ రష్దీ, ప్రముఖ రచయిత

ఏదీ జనగణన.. జరిగేనా పునర్విభజన!

కడవేర్గు రాజశేఖర్

'త్వరలో నియోజకవర్గాల పునర్విభజన జరుగబోతున్నది. దీంతో రాష్ట్రంలో ప్రస్తుతమున్న 119 నియోజకవర్గాలు.. 140 నుంచి 150 వరకూ పెరుగుతాయి. అదయ్యాక.. మహిళా రిజర్వేషన్ల చట్టం ప్రకారం 33 శాతం సీట్లు వాళ్లకే ఇవ్వాల్సి ఉంటుంది. ఇది జరిగితే.. ఎవరి సీటు ఉంటదో? ఎవరి సీటు పోతదో? ఎవరికీ తెలియదు. అట్లాంటప్పుడు ఐదేండ్లపాటు ప్రతిపక్షంలో ఉంటే ఏమొస్తది? మా పార్టీలోకి రండి. అధికారాన్ని అనుభవించండి!'.. ఇదీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అధికార పక్షంలోని ఓ అగ్రనాయకుడు ఇస్తున్న ఆఫర్ అట! ఇంతకీ, ఆయన చెప్తున్నట్టు డీలిమిటేషన్ ఇప్పుడు జరిగే అవకాశముందా, లేదా? దీనిపై రాజకీయ విశ్లేషకులు, సెఫాలజిస్టులు ఏమంటున్నారు?

దేశంలో, రాష్ట్రాల్లో చట్టసభల నియోజకవర్గాల సంఖ్య, పరిధులను నిర్ణయించే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) జరుగాలంటే, ముందు జనగణన జరుగాలి. దేశంలో 2011లో చివరిసారిగా జనగణన నిర్వహించారు. లెక్కప్రకారం 2021లో మళ్లీ దీన్ని చేపట్టాలి. అయితే, కరోనా సంక్షోభం, సార్వత్రిక ఎన్నికల పేరిట ఈ ప్రక్రియను కేంద్రం వాయిదా వేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు జనగణనను ఇప్పట్లో చేపట్టే అవకాశం లేదని కొందరు అంటుంటే, వచ్చే ఆర్థిక సంవత్సరం ఈ ప్రక్రియ మొదలుకావొచ్చని మరికొందరంటున్నారు. దీంతో జనగణన, డీలిమిటేషన్‌పై మీమాంస మొదలైంది. ఈ నేపథ్యంలో.. అసలు జనగణన అంటే ఏమిటి? ఎలా చేపడుతారు? జనగణనకు, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తవ్వడానికి ఎంత సమయం పట్టొచ్చు? అనే చర్చ జరుగుతున్నది.

చరిత్రలో మొదటిసారి వాయిదా: 1872లో బ్రిటిష్ పాలనలో దేశంలో జనగణన ప్రక్రియ మొదలైంది. ఇంతవరకూ ఈ ప్రక్రియ ఎన్నడూ వాయిదా పడలేదు. 1941లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలోనూ దీన్ని నిర్వహించారు. అయితే, చరిత్రలో తొలిసారిగా కరోనా కారణంగా జనగణన ప్రక్రియను కేంద్రం 2021లో వాయిదా వేసింది. ఇదే కరోనా సంక్షోభ సమయంలోనే పొరుగున ఉన్న బంగ్లాదేశ్, నేపాల్ సహా ప్రపంచంలోని 143 దేశాలూ జనగణన ప్రక్రియ చేపట్టాయి. భారత్‌లో మాత్రం అలా జరుగలేదు. దీంతో అప్పట్లోనే మోదీ సర్కారుపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇక, కరోనా తగ్గి మూడేండ్లైనా కేంద్రప్రభుత్వం జనగణన ఊసే ఎత్తలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహిస్తారనుకొన్న జన గణనను సార్వత్రిక ఎన్నికల పేరిట కేంద్రం మరోమారు వాయిదా వేసింది.

బడ్జెట్‌లో కోతతో మళ్లీ వాయిదా: నిజానికి ఈ ఆర్థిక సంవత్సరం జనగణన ఉంటుందేమోనని అందరూ భావించారు. అయితే, కేంద్రం ఈ ఏడాది బడ్జెట్‌లో జనగణనకు రూ.1,309.46 కోట్లను మాత్రమే కేటాయించింది. నిజానికి దేశవ్యాప్తంగా ఇప్పటికిప్పుడు జనగణన చేపట్టాలంటే దాదాపు రూ.12 వేల నుంచి రూ. 15 వేల కోట్ల వరకూ నిధులు అవసరమవుతాయని నిపుణుల అంచనా. బడ్జెట్‌లో కేటాయించిన అరకొర నిధుల దృష్ట్యా ఈ ఆర్థిక సంవత్సరం జనగణన ఉండదని సుస్పష్టమైంది. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో జనగణన ఉండొచ్చేమోనని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు.

జనగణన ప్రక్రియ ఇలా..: జనగణనను రెండు దఫాల్లో నిర్వహిస్తారు. మొదటిది హౌస్ లిస్టింగ్ (ఇంటింటి సర్వే). రెండోది జనాభా గణన. ఇంటింటి సర్వేలో ఇంటి నంబర్, ఇల్లు రకం, యజమాని పేరు, వివరాలు, యజమాని కులం, జననాలు, మరణాలు, లింగం, వృత్తి, ఆదాయం, వలసలు.. ఇలా 35 అంశాలకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. రెండో దశలో 30 అంశాల్లో ఒక్కో వ్యక్తి వ్యక్తిగత వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి ప్రత్యేకంగా రికార్డు చేస్తారు. 2011 జనగణన మొత్తం ప్రక్రియ పూర్తవ్వడానికి 11 నెలల సమయం పట్టింది. హౌస్‌లిస్టింగ్‌కు 8 నెలల సమయం కాగా, రెండో దఫా పూర్తవ్వడానికి మూడు నెలల సమయం పట్టింది. అలా ఏప్రిల్ 1, 2010లో ప్రారంభమైన జనగణన ప్రక్రియ మార్చి 31, 2011న పూర్తయింది. అయితే, ఇప్పుడు చేపట్టబోయే జనగణనను మొబైల్ అప్లికేషన్ల సాయంతో పూర్తిగా డిజిటైజేషన్ పద్ధతిలో చేపడుతామని హోంమంత్రి అమిత్‌షా చెప్పున్నారు. దీంతో జనగణన ప్రక్రియ పూర్తిచేయడానికి గతంతో పోలిస్తే ఈసారి తక్కువ సమయమే పట్టొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

> **2011లో జనగణన చేపట్టే సమయంలో ఆధార్ కార్డుల వివరాలు లేవు. నేషనల్ పాపులేషన్ రిజిష్టర్ (ఎన్పీఆర్) డేటా అందుబాటులో లేదు. అయితే, ఇప్పుడు ఆ సమాచారం ప్రభుత్వం దగ్గర ఉన్నది. దీంతో తక్కువ సమయంలోనే జనగణన పూర్తవ్వవచ్చని చెప్తున్నారు. అయితే, జనగణన ఎప్పుడు మొదలుపెడుతారన్న విషయమే తేలాల్సి ఉన్నది.**

బౌండరీస్ డెడ్‌లైన్ మళ్లీ వాయిదా?: జనగణన ప్రక్రియ మొదలవ్వడానికంటే ముందు జిల్లాలు, తహసిల్‌లు, పట్టణాలు, మునిసిపాలిటీల పరిధులను మార్చకుండా ఉండేలా కేంద్ర ప్రభుత్వం జనగణన నిబంధనలు, 1990 రూల్ 8(4) ప్రకారం.. ఫ్రీజ్ అడ్మినిస్ట్రేటివ్ బౌండరీస్ పేరిట ఓ డెడ్‌లైన్‌ను విధిస్తుంది. ఈ డెడ్‌లైన్ ముగిసిన మూడు నెలల్లోపు సిబ్బందికి ట్రైనింగ్‌ను పూర్తిచేసి సాధారణంగా జనగణన ప్రక్రియను మొదలుపెడతారు. డిసెంబర్ 2020 నుంచి ఇప్పటికే 9 సార్లు ఈ డెడ్‌లైన్‌ను పొడిగించిన కేంద్రం.. చివరగా జూన్ 30, 2024ను డెడ్‌లైన్‌గా నిర్ణయించింది. అంటే, ఒకవేళ మరో పొడిగింపు ఉండకపోతే, వచ్చే అక్టోబర్‌లో జనగణన ప్రక్రియ ప్రారంభం కావచ్చు. అయితే, జనగణనకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించకపోవడంతో.. ఈ ఆర్థిక సంవత్సరం జనగణన ఉండకపోవచ్చుననే అభిప్రాయం కలుగుతున్నది. దీంతో ఫ్రీజ్ అడ్మిని స్ట్రేటివ్ బౌండరీస్ డెడ్‌లైన్‌ను కేంద్రం మరోసారి పొడిగించవచ్చని నిపుణులు చెప్తున్నారు.

విధానం-1: సీట్ల సర్దుబాటుతో డీలిమిటేషన్			
రాష్ట్రం	ప్రస్తుతం లోక్‌సభ సీట్లు	భవిష్యత్తులో సీట్లు	మార్పు
ఉత్తరప్రదేశ్	80	91	+11
బీహార్	40	50	+10
రాజస్థాన్	25	31	+6
మధ్యప్రదేశ్	29	33	+4
తమిళనాడు	39	31	-8
తెలుగు రాష్ట్రాలు	42	34	-8
కేరళ	20	12	-8
కర్ణాటక	28	26	-2
పంజాబ్	13	12	-1
హిమాచల్	4	3	-1
ఉత్తరాఖండ్	5	4	-1

విధానం-2: సీట్ల పెంపుతో డీలిమిటేషన్			
రాష్ట్రం	ప్రస్తుతం లోక్‌సభ సీట్లు	భవిష్యత్తులో సీట్లు	మార్పు
ఉత్తరప్రదేశ్	80	143	+63
బీహార్	40	79	+39
రాజస్థాన్	25	50	+25
మధ్యప్రదేశ్	29	52	+23
తమిళనాడు	39	49	+10
తెలుగు రాష్ట్రాలు	42	54	+12
కేరళ	20	20	-
కర్ణాటక	28	41	+13
పంజాబ్	13	18	+5
హిమాచల్	4	4	-
ఉత్తరాఖండ్	5	7	+2

జనగణన ప్రక్రియ పూర్తవ్వడానికి 11 నెలల సమయం పట్టింది. హౌస్‌లిస్టింగ్‌కు 8 నెలల సమయం కాగా, రెండో దఫా పూర్తవ్వడానికి మూడు నెలల సమయం పట్టింది. అలా ఏప్రిల్ 1, 2010లో ప్రారంభమైన జనగణన ప్రక్రియ మార్చి 31, 2011న పూర్తయింది. అయితే, ఇప్పుడు చేపట్టబోయే జనగణనను మొబైల్ అప్లికేషన్ల సాయంతో పూర్తిగా డిజిటైజేషన్ పద్ధతిలో చేపడుతామని హోంమంత్రి అమిత్‌షా చెప్పున్నారు. దీంతో జనగణన ప్రక్రియ పూర్తిచేయడానికి గతంతో పోలిస్తే ఈసారి తక్కువ సమయమే పట్టొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

జనగణనకు కేంద్రం విముఖం?!: జనగణన చేపట్టడానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు సుముఖంగా లేనట్టు మరికొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జనగణనతో పాటు కులగణన కూడా జరపాలని డిమాండ్ ఉంది. ఇప్పటికే అనేక రాష్ట్రాలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటొద్దని ఒకవైపు సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కులం అనే అంశం దేశంలో బలంగా వేళ్లూనుకొన్నది. అయితే, మతం ఆధారంగా రాజకీయాలు చేస్తున్న బీజేపీ.. ఇప్పటికిప్పుడు కులగణన చేపడితే, తమ ఓటుబ్యాంకు విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉన్నదని భావిస్తున్నదని కొందరు అంటున్నారు. అందుకే కులగణన భయంతో జనగణనను కేంద్రం ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తున్నదని చెప్తున్నారు. ఒకవేళ కులగణనపై ఎన్డీయే సర్కారు ముందుకు వెళ్దామనుకొన్నప్పటికీ, బీసీ జనాభా సంఖ్య వెల్లడైకోటాల పెంపు డిమాండ్ ముందుకొస్తే, రిజర్వేషన్ల పరిమితి తొలగింపునకు రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. రాజ్యసభలో మెజారిటీ లేని పాలకపక్షాన్ని ఇదొక విధంగా ఆత్మరక్షణలో పడేస్తుందన్న వాదనలు కూడా ఉన్నాయి. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే.. కులగణన, జనగణన, డీలిమిటేషన్, మహిళలకు 33 శాతం కోటా వర్తింపు .. ఇవన్నీ ఇప్పటికిప్పుడు జరిగే అవకాశం లేదని నిపుణుల మాట. కాగా విభజన చట్టం ప్రకారం.. తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనను నిజానికి పదేండ్ల కిందటే చేయాలి. అయితే, అది జరుగలేదు. ఇప్పుడు చేస్తారా? అనేది కూడా మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది.

> **జనగణనతో డీలిమిటేషన్‌కు లంకె:** డీలిమిటేషన్ చట్టం-2002 ప్రకారం.. 2026లో డీలిమిటేషన్ ప్రక్రియను మొదలుపెట్టాలంటే అంతకుముందే జనగణన ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. పెరిగిన సాంకేతికతను పరిగణనలోకి తీసుకుంటే, జనగణనకు ఏడు నెలలు, కులగణన కూర్పునకు ఒక నెల, డీలిమిటేషన్‌కు మరో మూడు నెలలు.. అలా 11 నెలల్లో ఈ మొత్తం ప్రక్రియను పూర్తిచేయవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం: డీలిమిటేషన్ ప్రక్రియ చేపడితే, ఉత్తరాది రాష్ట్రాలకు మేలు జరుగగా.. దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియలో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్విభజిస్తారు. అంటే ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ లోక్‌సభ సీట్లు, తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లను కేటాయిస్తారు. 70వ దశకంలో జనాభా నియంత్రణ చేపట్టాలన్న కేంద్రం పిలుపుతో దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పాటించగా, ఉత్తరాదిలో జనాభా విస్ఫోటనం జరిగింది. ఇప్పుడు ఈ అధిక జనాభాయే ఉత్తరాదికి లాభంగా మారింది. అయితే, తలసరి ఆదాయం, జీఎస్డీపీ, వడ్డీల చెల్లింపు, పన్ను రాబడులు, దేశ జీడీపీలో వాటా ఎక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు జనాభా ప్రాతిపదికన చేస్తున్న ఈ డీలిమిటేషన్‌తో నష్టమేనని నిపుణులు చెప్తున్నారు. జనాభా సాకుతో దక్షిణాదికి అన్యాయం చేయవద్దని అంటున్నారు.

రెండు పద్ధతుల పరిశీలన: డీలిమిటేషన్ ప్రక్రియ కోసం కేంద్రం రెండు పద్ధతులను పరిశీలిస్తున్నట్టు సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే ఉన్న 543 లోక్‌సభ సీట్లను అలాగే ఉంచి.. జనాభా ప్రాతిపదికన రాష్ట్రాల మధ్య సీట్ల సర్దుబాటు చేయడం ఒకటైతే, లోక్‌సభ సీట్లను 543 నుంచి 848కి పెంచడం మరొకటిగా అంచనా వేస్తున్నారు. అయితే, ఈ రెండు విధానాల్లోనూ దక్షిణాదికి జరిగేది అన్యాయమేనని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించటం, పార్టీ మ్యానిఫెస్టోను అటకెక్కించటంలో ప్రధాని మోదీ మార్గంలో దూసుకెళ్తున్నారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని మ్యానిఫెస్టో ద్వారా ప్రకటించి, తిరుపతి వెంకన్న సాక్షిగా హామీ ఇచ్చింది. తీరా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రధానిగా ఇచ్చిన ఆ హామీని తూచ్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'పార్టీ' ఫిరాయింపుదారులు అనర్హులయ్యేలా చట్ట సవరణ చేస్తామని రాజ్యాంగ ప్రతి సాక్షిగా హామీ ఇచ్చారు రాహుల్‌గాంధీ. తర్వాత తెలంగాణలో అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ పార్టీ. కానీ, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి తూచ్ అంటున్నారు. వరుసబెట్టి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గుంజుకుంటున్నారు. తన హామీని, కాంగ్రెస్ మ్యానిఫెస్టోను అటకెక్కించిన రేవంత్ నిర్ణయాలను రాహుల్‌గాంధీ ఏ మాత్రం ఖండించడం లేదు. అంటే బీజేపీ, కాంగ్రెస్ దొందూ, దొందేనని రాహుల్‌గాంధీ చెప్పదలచుకున్నారా?

ఎగసిపడే కెరటం బీఆర్ఎస్

పాతూరి వేంకటేశ్వర రావు
98490 81889

జవహర్‌లాల్ నెహ్రూను కించపరుస్తూ ప్రధాని మోదీ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కించపరుస్తూ సీఎం రేవంత్ గొప్పవాళ్లుగా భాసించగలమని భ్రమిస్తున్నారు. ఈ మూడు సార్లే కాదు, మరో మూడు సార్లు ప్రధాని ఐనా నెహ్రూలా మోదీకి, మరో పదిసార్లు సీఎం అయినా కేసీఆర్‌లా, రేవంత్‌కు ప్రజల హృదయాల్లో చోటు దక్కదు గాక దక్కదు. ఎందుకంటే నెహ్రూ, కేసీఆర్‌లు తమ లక్ష్యసాధనంగా రాజకీయాన్ని మలచుకున్నవాళ్లు. ఉదాహరణకు హిరాకుడ్, భాక్రానంగల్ వంటి భారీ ఆనకట్టలతో వ్యవసాయ అభివృద్ధికి.. ఖిలాయ్ రూర్కెలా, ఉక్కు కర్మాగారాలతో పారిశ్రామికాభివృద్ధికి దృఢమైన పునాది వేసి, అలీన విదేశాంగ విధానం ద్వారా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చి భారతీయుల హృదయాలలో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నారు నెహ్రూ. దటీజ్ భారత రత్న జవహర్‌లాల్ నెహ్రూ.

'మిషన్ కాకతీయ'తో ఆకలి తెలంగాణను అన్నపూర్ణగా 'భారత ధాన్యాగారం'గా రూపొందించారు కేసీఆర్. ఎడ్యుకేషనల్ హబ్, వేల గురుకులాలతో తెలంగాణ విద్యాభివృద్ధికి.. ఐటీ హబ్ ద్వారా పారిశ్రామికాభివృద్ధికి... హరితహారాలతో హైదరాబాద్‌ను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా, యాదాద్రిని అద్భుత శిల్పకళా క్షేత్రంగా, అపర తిరుమలగా... అటవీ పునరుద్ధరణ ద్వారా వర్షాభావ, కాలుష్యరహిత తెలంగాణను కేవలం దశాబ్దకాలంలో తలసరి ఆదాయంలో భారతాగ్ర రాష్ట్రంగా తెలంగాణను రూపొందించిన లక్ష్యసాధకుడు తెలంగాణ పిత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు. మరో ముఖ్యాంశమేమంటే, ప్రాణాలకు తెగించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన తెలంగాణ పితను వల్లర్‌గా, కఠోరంగా దూషిస్తే ప్రజల దృష్టిలో హీరోనౌతానన్న భ్రమలో ఉన్నట్లున్నారు రేవంత్. కానీ, జాతిపితను హతమార్చిన గాడ్సేలా అపఖ్యాతి పాలౌతారన్న విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలి.

> **పాలన పట్ల, రాష్ట్ర ప్రగతి పట్ల దృష్టిసారించవలసిన రేవంత్ బ్లాక్‌మెయిలింగ్ ప్రలోభాలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పీక్కోవటమే ఎజెండాగా పెట్టుకున్నారు. పైగా నాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ లాక్కుంటే తప్పుకానిది, నేను బీఆరెస్ ఎమ్మెల్యేలను లాక్కుంటే తప్పేమిటని దబాయిస్తున్నారు. అవకాశవాద మేధావులు, మీడియావాళ్లు ఆయనతో గొంతు కలపటం మరింత దురదృష్టం.**

కానీ, నాటి చారిత్రక వాస్తవాలను ఒకసారి పరిశీలిద్దాం.. తెలంగాణ శిశువును శక్తివంతంగా తీర్చిదిద్దుకోవాలన్నదే కేసీఆర్ ఏకైక లక్ష్యం. సదరు లక్ష్యాన్ని నిరాటంకంగా కొనసాగించాలంటే..? 1. శత్రువులు ఏకమై తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఏ మాత్రం అవకాశం లేనంతగా దాన్ని పటిష్ఠపరుచుకోవటం. ఉదాహరణకు చంద్రబాబు-రేవంత్‌ల ఓటుకు నోటు వ్యవహారం, వగైరా. 2.ఉద్యమకారులనే మంత్రులుగా తీసుకుని వాళ్లకు శిక్షణనివ్వటం ద్వారా కాలహరణమౌతుంది కనుక, ఇతర పార్టీల వారైనా కొందరు అనుభవజ్ఞులను మంత్రులుగా నియమించుకోవటం. తద్వారా తన లక్ష్య సాధనను వేగవంతం చేయటం. 3.నాటి చీకటి తెలంగాణలో వెలుగులు నింపాలన్న తపనతో ఖర్చుకు వెనకాకుండా తక్షణం ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనటం. 4.వర్షాభావంతో, సాగునీరు లేక బోరులెండి, విద్యుత్తు కొరతతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలి, పంట చేలు ఎండి, దిక్కుతోచక రైతులు నిత్యం ఆత్మహత్యలకు పాల్పడటాన్ని అరికట్టాలన్న దీక్షతో, అప్పుచేసి మరీ 90 వేల కోట్లతో, ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందిన కాళేశ్వరాన్ని కేవలం మూడేండ్లలో పూర్తిచేయటం ఆయన లక్ష్య సాధనా వేగానికి నిలువెత్తు నిదర్శనాలు. నాడు సోషలిస్టు శిశువును బలోపేతం చేసుకునే వెసులుబాటు కోసం ఫాసిస్టు హిట్లరుతో కొంతకాలం రాజీ చేసుకున్నాడు రష్యాధినేత స్టాలిన్. అలాగే తెలంగాణ శిశువును ఎక్కదీసుకునే వెసులుబాటు కోసం కేంద్రంలోని కార్పొరేట్ బీజేపీతో స్నేహపూర్వకంగా మెలిగారు కేసీఆర్. నాడు తన రష్యా భద్రత కోసం హిట్లర్‌తో రాజీ పడ్డందుకు ప్రపంచం దుమ్మెత్తిపోస్తున్నా లెక్కచేయలేదు స్టాలిన్. అలాగే ప్రగతి నిరోధక బీజేపీతో రాజీ పడ్డాడంటూ ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోసినా లెక్కచేయలేదు కేసీఆర్. అర్జునునకు తాను గురిపెట్టిన పక్షి తప్ప, మరేవీ కనిపించనట్టు, లక్ష్య సాధకులకు తమ లక్ష్యమే తప్ప ఇంకేవీ కనిపించవు, వినిపించవు. తన అధికార పదవీ భద్రత కోసం, రేవంత్ ప్రోత్సహిస్తున్న పార్టీ ఫిరాయింపుల అక్రమాన్ని, తెలంగాణను శీఘ్రంగా సుసంపన్నం చేయాలన్న లక్ష్యంతో చేసిన కేసీఆర్ చర్యతో పోల్చి సమర్థించటం రాహుల్‌గాంధీని, కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ఘోరంగా అవమానపర్చటమే.

కేసీఆర్ కుటుంబసభ్యులు తప్ప ఎవరూ లేకుండా బీఆర్ఎస్‌ను ఖాళీ చేస్తానంటూ సవాల్ విసురుతున్న రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్న వాస్తవాలు రెండున్నాయి. 1.పడినా తిరిగి ఉవ్వెత్తున ఎగసిపడే కెరటం బీఆర్ఎస్. 2.పడగొడితే రేపటి కల్లా మరింత ఎత్తుగా, అందంగా తన గూటిని అల్లుకోగలిగిన సాలీడంత ఓర్పు, నేర్పు గల ఉద్యమనేత కేసీఆర్.

వీర రాజారెడ్డి వీరోచిత పోరాటం

బసవరాజు నరేందర్‌రావు
99085 16549

> **సురబాల ధరియించు నగలలో కూర్చబడు**
> **ఆ గొప్పదనమును ఆశించ నేగోర**
> **ప్రేయసిని మురిపించు ప్రేమికుని మాలలో**
> **చేర్చబడి ప్రేయసిని మురిపించనేగోర**
> **సామ్రాట్టు శవముపై హరినామ స్మరణతో**
> **వేయబడు పూలలో నేనుండగోర**
> **దేవతల శిరసుపై వుంచేటి పుష్పముల**
> **చేర్చబడు భాగ్యముతో గర్వించనేగోర**
> **ఓ మాలి! నను తెంపి విసురుమాబాట**
> **యే బాట నడిచెరో వీరులెంతోమంది**
> **మాతృదేశం కొరకు శిరసులర్పించ**
>
> **(ప్రముఖ హిందీ కవి మాఖన్‌లాల్ చతుర్వేది 'పుష్ప్ కి అభిలాష' కవితకు ఈ వ్యాస రచయిత చేసిన స్వేచ్ఛానువాదం ఇది)**

మాతృభూమి పరిరక్షణలో తమ ప్రాణాలను బలిపెట్టేందుకు సిద్ధమై ముందుకు సాగుతున్న వీరుల త్యాగాల విలువలను, ఒక పుష్ప విన్నపం ద్వారా కండ్లకు కట్టినట్టుగా వర్ణించాడు కవి మాఖన్ లాల్ చతుర్వేది. వివరంగా పరిశీలిస్తే.. తనను తెంపడానికి వచ్చిన తోటమాలితో ఒక పుష్పం తన బలీయమైన కోరికను ఈ విధంగా తెలియజేస్తుంది.

'ఓ మాలీ! నన్ను తెంపుకో.. కానీ, తర్వాత నన్ను ఎక్కడ ఉంచాలన్న విషయంలో మాత్రం దయచేసి నా ఒక్క చిన్న విన్నపాన్ని ఆలకించు. దేవకన్యల